# దేవుడే హంతకుడు



అది పాములాంటి రాత్రి!

చీకటిని మృదువుగా మింగుతోంది.

ఏదో భరించలేని బాధ ఒకటి అక్కడ ఫ్యాక్టరీ చుట్టూ పారాకాస్తోంది. ఆ ఫ్యాక్టరీలో యంత్రాలు మరొక దేశం బారినపడినట్టు ఘీపెడుతున్నాయి. నైట్‌షిఫ్ట్‌లో అందులో సుమారు యాభైమంది కార్మికులు తమ డ్యూటీని మోస్తున్నారు తరుముకొస్తున్న ప్రయివేటీకరణ వేటుకి భయంభయంగా.

దానిని వర్క్‌షాపు అనవచ్చు. ఫ్యాక్టరీ అనవచ్చు లేదా గారేజీ అనవచ్చు. అది ప్రవేటు వాళ్లది కాదు. ప్రభుత్వానిదే. లౌకికవాదానికే ఇవ్వాలి ప్రాధాన్యత. కాని అది కులపరమైన మతతత్త్వ ఊబిగుంట.

యంత్రాలు తమపని తాము చేస్తుంటే, అదంతా ఓ దేవత కృపతోనే జరుగుతుందని కొందరి అమాయకపు మెకానిక్కుల నమ్మకం. సాంకేతిక విజ్ఞానం గురించి అవగాహన లేదు. ప్రశ్నించే తెలివితేటలు వాళ్ల సీనియర్స్ ఎప్పుడూ నేర్పలేదు. ఉమ్మడి మతపిచ్చి. స్వంతభావాల్ని బయటకు రానీయకుండా అణచివేసే తత్త్వం గల మనుషుల ముఠా అది.

గారేజీలో ఎప్పుడో చిన్న దుర్గాదేవి పటం పెట్టి పూజచేసుకున్న మెకానిక్‌ల ఆరాధ్యదేవత ఇపుడు ఓ దేవతా విగ్రహంగా మారింది. చిన్న మందిరంలో పెద్ద పూజలు. పూజా కార్యక్రమాలకి ఓ కమిటీ కూడా ఉంది. అదో మానవ ఛాందస రిలిజియస్ నెట్‌వర్క్.

ఉద్యోగం బాగా సాగాలంటే యాజమాన్యం కార్మికచట్టాల్ని పరిరక్షించాలి. కార్మికునికి, అతని కుటుంబానికీ రక్షణ బాధ్యత యాజమాన్యం వహించాలి. ఈలోగా ఎక్కడ్నుంచో ఓ దేవత రంగప్రవేశం చేయాలి. ఆ దేవత కూడా వాళ్లని రక్షిస్తూ కాపాడుతూ ఉండాలి. ఇంతకీ వాళ్లని ఆదుకోవలసింది ప్రభుత్వ యాజమాన్యమా లేక గారేజీలో దేవతా అనేది తేలని సమాధానం.

దసరా ఉత్సవాలు గారేజీలో జరుగుతాయి.

రోజుకో కార్మికుని భార్య వచ్చి భారీ పూజలు చేసి, ప్రసాదాలు పంపిణీ చేయడం అక్కడో సాంప్రదాయంలాంటి సెంటిమెంటు. సెంటిమెంట్ అంటే ఆలోచనారహితమైన భావోద్వేగమే అని చాలా తక్కువమందికి తెలుసు.

ఈ సాంప్రదాయం తక్కిన మతాల ఉద్యోగులైన ఖాన్‌భాయ్‌కి, లాజర్ బాబాయికీ లోలోన చాకుతో కెలికినట్టే ఉంటోంది. అది మతవ్యవస్థ. తప్పదు. మనుషుల్ని కాల్చుకుతింటోంది.

* * *

షిఫ్ట్ సూపర్‌వైజర్‌కి గారేజీలో జరిగే తంతంగమంతా తెలుసు. పై అధికార్లకు ఇంకా బాగా

తెలుసు. వాళ్లకు డిగ్రీలున్నాయి. కాని ఆధునిక జ్ఞానం బుర్రకింకా చేరలేదు.

నవరాత్రుల దేవీపూజల అనంతరం దుర్గా మాతకు భరించలేని దాహం వేస్తుంది. దానికి నీళ్లూ పాలూ చాలవు. రక్తం కావాలి. పాతమానవుడు దేవతలకు నరబలి ఇచ్చేవాడు. మనిషికి కాస్త నాగరికత అబ్బిన తర్వాత జంతుబలి ప్రారంభించాడు. అందులో తప్పొప్పుల గురించి ఆలోచించే జ్ఞానం శూన్యం.

సెక్యూరిటీ సెక్షన్ ముందునుంచే రెండు మేకపోతులు లాక్కొచ్చారు. అటువంటి సమయాల్లో సెక్యూరిటీ వాళ్లు సైలెన్స్ అయిపోవాలి. కళ్లుమూసుకోవాలి. అంతా సానుకూల న్యాయ వ్యవహారం.

బ్లాక్‌స్మిత్ విభాగంలో ఇనపబద్దీల్ని సునాయాసంగా వంచెయ్యగల పనిగాడు బట్టతల గంగరాజు. పదంగుళాల పట్టాకత్తికి బాగా పదును పెట్టాడు. అగ్నికొలిమిలా మండుతున్నాడు.



జి. నరసింహామూర్తి

చారెడు కుంకుమ నొసటికి రాసాడు. నల్లనిక్కరు మీద ఎర్రని నూలు టవలు బిగించి కట్టాడు. బానలాంటి అతని పొట్ట కొవ్వుతో ఊగిసలాడు తోంది.

బొడ్లోంచి చిన్న బాటిల్ తీసాడు. దాని మూ తని పళ్లతో ఫట్‌మని కొరికి, థుపుక్కున ఊసా డు. అందులో విస్కీ గటగటా తాగేసి ఖాళీ సీసాని ప్రహారీగోడ అవతలకి విసిరాడు. అది ఏ రాయి మీద పడిందోగాని ఆఖరిసారిగా ఘొల్లుమంది.

రెండు మేకపోతుల్ని తోసుకుంటూ, గెంటు కుంటూ తీసుకొచ్చారు గంగరాజు దగ్గరికి.

గంగరాజు కళ్లతో సైగచేసాడు తతిమ్మా కార్యక్రమం త్వరగా కానిమ్మని.

మేకపోతుల నెత్తికి పసుపూ కుంకుమా పులి మారు ఆఖరి సన్మానంకి సమాయత్తంకామని.

ఆ తంతు ఎన్నికల సమయంలో పేదవాడి ఎండిన కడుపుమీద చల్లని గంధం పూసిన వాగ్దానం తంతులా ఉంది.

"మాసం వాటాలయ్యేసరికి తెల్లార్తాది. తం తులు మాని పని యెంటనే కానియ్యండెహె!" అన్నాడు హెల్పర్ సూర్యనారాయణ.

ఓ మేకపోతును దుర్గాదేవి విగ్రహం ముం దుకి లాక్కొచ్చారు. అది యెగిరిపడుతుంటే కొమ్ముల్ని విరగదీసి దానిని తమ కాళ్ల మధ్య బిగించి ఇద్దరు పట్టుకున్నారు.

గంగరాజు "జై దుర్గామాతా" అంటూ గర్జి స్తూంటే అతని నోట్లో పళ్లు కండలుపీకే పులి కోరల్లా కనిపించాయి. ఆ చుట్టూ ఉన్నవాళ్లు మూర్ఖులైన ఆటవికుల్లా కనిపించారు.

మేకపోతు మెడని కస్సున నరికిపారేసాడు గంగరాజు ఏదో మహత్తులా.

మేకపోతు రక్తం చెల్లున చిమ్మి ఎర్రని మంటలా నేలమీద పాకింది. మేకపోతు తల దుర్గముందు ఉంచాడు ఓ వర్కరు భక్తితో.

దండాలెట్టుకున్నారు. కొందరు రక్తంతో బొట్లు పెట్టుకున్నారు.

భూతదయకి అర్థం ఆ చచ్చిన మేకతో పాటు చచ్చింది.

ఈ తంతంతా చీకట్లో నిలబడి చూసాడు ఎలక్ట్రీషియన్ శామ్యూల్.

రెండో మేకపోతు తల కూడా తెగింది.


అటువేపు వచ్చి అంతా పరీక్షగా గమనిస్తు న్న ఫిట్టర్ హుస్సేన్ అదిచూసి, గబగబా వెనక్కి వెళ్లాడు.

చాలాకాలంగా గారేజీలో సాగుతున్న మాతాధిపత్యానికి బ్రేక్‌వెయ్యాలి. అదే వాళ్ల ఉ ద్దేశ్యం అందుకు చెయ్యాల్సింది చేసిపారెయ్యాలి.

## గమనిక

సాహిత్య కార్యక్రమాల ఫొటోలు ప్రచురణార్థం పంపించేటపుడు ఆ కార్య క్రమం జరిగిన తేదీ, స్థలం తప్పక ఉదహరించాలి. ఈ వివరాలు లేకుం డా వచ్చే ఫొటోలు ప్రచురణకు స్వీక రించబడవని గమనించగోర్తాం.

– ఎడిటర్




అదే వాళ్ల ఆలోచన.

* * *

తెల్లవారింది.

గంగరాజుతో పాటు గారేజీలో పదిమంది కార్మికుల శవాలు చిందరవందరగా పడున్నాయి.

గుడిలో దుర్గాదేవి అలానే కళ్లప్పగించి చూస్తోంది.

ఇనపరాడ్లు - కర్రలు - చాకులు - కత్తులు!

మతం మతంతో, మనిషి మనిషితో శాంతియుతంగా బతకడానికి రాసుకున్న ఇండియన్ రిపబ్లిక్‌లో మతచాంధసత్వం!

ఘోరమంతా క్షణాలమీద హెడ్ఆఫీస్‌కెళ్లిపోయింది. ఆఫీసర్లు రయ్యిన వచ్చిపడ్డారు.

పోలీస్ డియస్పీ వచ్చాడు.

గంగరాజు, ఎలక్ట్రీషియన్ శామ్యూల్, ఫిట్టర్ హుస్సేన్ శవాలతో పాటు ఇంకా కొందరి శవాలు పడిఉన్నాయి.

గారేజీ వర్కర్స్ కాకుండా ఎవరో పైవాళ్ల శవాలు కూడా అక్కడ ఉండడంతో, ఉమ్మడి దాడి జరిగిందని తెలిపోయింది.

మతపరమైన మానవబాంబులు!

మతపరమైన మానవదాడులు!

"అక్కడ జరిగింది మనుషుల యుద్ధంకాదు. దేవుళ్ల యుద్ధం" అన్నారెవరో కాస్త విజ్ఞతతో.

మీడియా పరుగెత్తుకొచ్చింది.

మర్నాడు ఓ వార్తాపత్రిక "మతం చేసిన మారణకాండ" అని రాస్తే -

మరో పత్రిక "ఈ ఘోరానికి శిక్షేమిటి?" అని ప్రశ్నిస్తే -

ఇంకో పత్రిక "దేవుడే హంతకుడు" అని నేరస్తుడ్ని నిర్ధారించేసింది. ●